# వయాగ్రాకి పోటీమందులు
# ఏది మంచిది?

**వయాగ్రా (సిల్డినాఫిల్) మానవజాతి చరిత్రలోనే గొప్ప సంచలనాత్మక ఔషధం. ఎందుకంటే ప్రపంచం మొత్తం మీద 1500 లక్షల మందిలో అంగ స్తంభన దోషాలున్నాయని అంచనా. దోషాలు లేకపోయినా స్తంభనాన్ని మెరుగుపరచుకోరాలని ఆశపడే వారి సంఖ్య అంచనాలకి మించింది. అలాంటివారి ఆశలకి రెక్కలు కల్పిస్తూ, నిజమైన తొలి అంగస్తంభక ఔషధంగా పేరు సంపాదించుకుంది 'వయాగ్రా (సిల్డినాఫిల్ )'**

అదలా ఉంచితే భౌగోళికంగా మనిషి ఆయుర్దాయం పెరిగి, వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. వృద్ధులతో పాటే వారికి కలిగే సమస్యలూ పెరుగుతున్నాయి. వాటిల్లో స్తంభన సమస్యలు కూడా ఒకటి.

కనుక వయాగ్రా లాంటి ఔషధం అన్ని వయసుల మగవాళ్ళకీ, వాళ్ళని నమ్ముకున్న ఆడవాళ్ళకీ అమృతోపమానమే!

### వయాగ్రా ఎలా పనిచేస్తుంది?

అది తెలుసుకోవాలంటే, ముందు అంగస్తంభనం ఎలా జరుగుతుందో తెలుసుకోవాలి.

ఆఁ, మీరు మరీను, మా కాపాటి తెలీదా ఏం? సెక్సు కోరికలు కలిగితే అంగం అదే లేచి గట్టిపడుతుంది' - అంటూ అడ్డుపడకండి.

గట్టిబడుతుంది సరే! మనసులో కలిగే సెక్సుకోరిక అంగాన్ని తట్టి లేపటంలో ఎన్ని రసాయనిక చర్యలున్నాయో, ఎన్ని నాడీ చర్యలున్నాయో, ఎన్ని రక్త ప్రసరణ గమ్మత్తు లున్నాయో, ఎన్ని కండరాల సహకారం కావాలో పూర్తిగా చెప్పడాని కొక పుస్తకమే రాయాలి.

ఒక్క ముక్కలో చెప్పాలంటే అంగస్తంభనం అనేది శరీరంలో అనేక అవయవాలు... కణాలు... రసాయనాల పరస్పర సహకారం, చర్యల వల్ల సాధ్యమయ్యే ఒక సంక్లిష్టమైన కార్యం. కనబడ్డంత సులువు కాదు.

మెదడు, వెన్నుపాము, నరాలు, రక్త నాళాలు, పురుషాంగంలోని ఖాళీస్థలాల చుట్టూ గల కండరకణాలు, ఇవన్నీ కలిసి అంగస్తంభనానికి కావలసిన హార్డ్‌వేర్ కాగా, మనసులో కలిగే సెక్సు కోరిక, ఆ కోరికని కలిగించే జ్ఞానేంద్రియాలు, మనసు, అది పంపే సిగ్నల్సు, వాటి వల్ల ఉత్పత్తయ్యే హార్మోనులూ... ఇవన్నీ అంగస్తంభనకి కావలసిన సాఫ్ట్‌వేర్లు.

కామోద్రేకం కలిగినపుడు మెదడు ఆ విషయాన్ని గ్రహించి వెన్నుపాములోని నాడీవ్యవస్థకి సంకేతాలు పంపిస్తుంది. ఈ స్వతంత్ర (అటానమస్) నాడీవ్యవస్థకి సంబంధించి రెండు రకాలు నరాలు ఉంటాయి - సింపతెటిక్ నరాలు, పేరా సింపతెటిక్ నరాలు అని. వెన్నుపూసలో $T_{10}$ నుంచి $L_2$ వెన్నుపూసల వద్ద గల వెన్నుపాము నుంచి బయటకొచ్చే సింపతెటిక్ నరాలు అంగం మెత్తగా, కురచగా కుదించుకుని ఉండేలా చూస్తాయి. $S_2$-$S_4$ వెన్నుపూసల వద్ద వెన్నుపాము నుంచి వెలువడే పేరా సింపతెటిక్ నరాలు అంగం స్తంభించి, గట్టిపడేటట్టు చేస్తాయి.

సెక్సు కోరికలు కలిగితే ఈ పేరా సింపతెటిక్ నరాలను మెదడు నిద్ర లేపుతుంది. అవి అంగం లోపల ఉండే కండరపు కణాలు వద్ద నైట్రిక్ ఆక్సైడ్‌ని విడుదల చేస్తాయి. ఆ నైట్రిక్ ఆక్సైడు గబగబా మరికొన్ని రసాయన చర్యలు చేసి, మరికొన్ని టిష్యూలని ప్రేరేపించి అంగంలోని రక్తనాళాల గోడలు పట్టు సడలించేలా చేస్తుంది (Relaxing of Vascular Smooth Muscles). ఎప్పుడైతే రక్తనాళాల గోడలు పట్టు సడలించాయో గట్టు తెంపుకున్న నదిలా రక్త ప్రవాహం అంగంలోపలి స్పాంజి టిష్యూలను నింపేస్తుంది.

ఆ రక్తం మొత్తం వెనక్కి (శరీరం లోకి) వెళ్ళిపోకుండా శ్రీరాంసాగర్ లాకులు వేసేసినట్టు చేసే ఏర్పాటుంది అంగంలో!

దాంతో లోపలికి అలా రక్తం వచ్చేస్తుంటే అంగం నెమ్మదిగా పెద్దదై లేచి నిలబడి, ఇంక పెద్దదయ్యే అవకాశం లేక, గట్టిబడి, బిగుస్తుంది. అదే అంగ స్తంభన మంటే! బుడగలోకి గాలి బలంగా ఊదుతూ ఆ గాలి బయటికి పోకుండా వేళ్ళతో బుడగమూతిని నొక్కిపెడితే ఏం జరుగుతుందో అలాగే యిదీను.

## ఇంతకీ వయాగ్రా ఎలా పనిచేస్తుందో చెప్పలేదు!

అంగస్తంభనం జరగడంలో నైట్రిక్ ఆక్సైడ్ విడుదల, ఆ తదుపరి దశలు ఎంత ముఖ్యమైన పాత్ర వహిస్తాయో తెలిసి రావడం స్తంభన దోషాల చికిత్సలో ఓ పెద్ద మలుపు.

వాటి డిస్కవరీ ఫలితంగానే ఫాస్ఫో డైఎస్టరేజ్‌లను నిరోధించే మందులు కనిపెట్టడం జరిగింది. ఆ కనిపెట్టడం కూడా ఒక విధంగా అనుకోకుండా జరిగినదే.

గుండెపోటు నివారణ కోసం ఔషధ ప్రయోగాలు చేస్తూ ఫైజర్ సంస్థ రూపొందించిన ఓ మందుని ప్రయోగించి చూస్తున్నపుడు దానికి ఓ సైడ్ ఎఫెక్టు కనిపించింది. అదే అంగం స్తంభించడం! దాంతో అసలు పరిశోధన అంగ స్తంభనం మీదకి దారి మళ్ళింది. ఫలితమే వయాగ్రా (సిల్డెనాఫిల్).

## సిల్డెనాఫిల్ (వయాగ్రా)

ఇది పురుషాంగంలో ఉండే ఫాస్ఫోడైఎస్టరేజ్ (టైప్ 5) (PDE5) అనే ఎంజైము పనిచేయకుండా నిరోధించే మందు! కనుక PDE-5 ఇన్హిబిటర్ అన్నారు దీన్ని.

PDE-5 పనిచేయకపోతే అంగపు టిస్యూలతో cGMP అనే పదార్థం నిల్వలు పెరుగుతాయి. ఆ పదార్థం అంగంలోని రక్తనాళాల నునుపు కండరాల బిగి సడలించి అంగంలోకి రక్తం వేగంగా ప్రవహించేలా దోహదం చేస్తుంది. ఫలితంగా అంగం స్తంభిస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా ఈ మందుని 2 కోట్ల మంది వాడుతున్నట్టు అంచనా. 25, 50, 100 mg డోస్‌లో ఈ మందు యిండియాలో ఎడిగ్రా, పెనిగ్రా, ఎరెక్స్... వగైరా పేర్లతో దొరుకుతోంది.

## హార్టు పేషెంట్లకి ఈ మందు

## ఎందుకు వాడకూడదు?

వయాగ్రాని హార్టు పేషెంట్లుకి వాడవచ్చు. (కంగుతినకండి!) ఎటొచ్చీ నాలిక కింద పెట్టుకునే బిళ్ళతో కలిపి వాడితే ప్రాణప్రమాదం వాటిల్లవచ్చు. ఇతర నైట్రోగ్లిజరిన్ మందులు ఏవి వేసుకుంటున్నా వయాగ్రా వాడడానికి వీల్లేదు.

హార్టు పేషెంట్లు కార్డియాలజిస్టు పెర్మిషన్‌తో, ఆయన ప్రిస్క్రయిబ్ చేస్తే కొన్ని జాగ్రత్తలు పాటిస్తూ తప్పక వయాగ్రా వాడవచ్చు.

## మరి షుగర్ పేషెంట్లు?

షుగర్ పేషెంట్లు, హార్మోను దోషా లున్నవారు, నరాల దోషాలు గలవారు, వివిధ ఆపరేషన్లై కోలుకున్న వారు, తెలియని కారణాల వలన, మానసిక కారణాల వల్ల, నపుంసకత్వం ప్రాప్తించిన వాళ్ళు - అందరూ ఆయా డాక్టర్లు ఓకే చేస్తే వయాగ్రా వాడవచ్చు.

ఫలితాలు మనిషి మనిషికీ, లేదా జబ్బుజబ్బుకీ వేర్వేరుగా ఉంటాయి.

ముఖ్యంగా గుర్తుంచుకోవలసింది ఏంటంటే అంగస్తంభన సమస్య కొంద రిలో వయాగ్రాతో యిట్టే తీరిపోతుంది. కొందరిలో తీరదు. తీరని వారు సెక్స్ థిరపిస్టుని సంప్రదిస్తే తప్పనిసరిగా వారి సమస్యకి సరైన పరిష్కారం దొరుకు తుంది.

సిల్డెనాఫిల్ మాత్రని వేసుకున్న 1 గంట సేపటిలో అది చాలామటుకు రక్తంలో కలిసిపోతుంది. 8-12 గం॥ల తర్వాత పరీక్షిస్తే ఒంట్లో (రక్తంలో) దాని ఆనవాళ్ళు ఉండవు. కనుక వయాగ్రావల్ల సత్ఫలితం కావాలనుకుంటే మాత్ర వేసుకున్నాక 20 ని. నుంచి 1 గం॥లోపు రతిలో పాల్గొంటే స్తంభనం బాగుం టుంది.

అంతేకాదు. భోజనం చేసిన వెంటనే ఈ మాత్ర వేసుకుంటే ఫలితం ఉండదు. భోజనమయ్యాక కనీసం 1-2 గం.లు ఆగి ఆపైన వేసుకోవాలి. అలాగే, వయాగ్రా వల్ల అంగం దానంత అది స్తంభించదు. మాత్ర వేసుకున్న అరగంట - గంటకి అంగాన్ని ప్రేరేపించుకుంటే చక్కగా స్తంభిస్తుంది.

## వర్డెనాఫిల్ (లెవిట్రా)

ఫైజర్ కంపెనీవారు మార్కెట్లో సృష్టించిన సంచలనం వల్ల మిగతా కంపెనీలు కూడా ఈ అంగస్తంభన ఔషధాలపై దృష్టి సారించాయి. ఫలితంగా PDE-5 ఇన్హిబిటర్ వర్గానికి చెందిన మరో కొత్త మందుని సృష్టించాయి... బేయర్, గ్లాక్సో కంపెనీలు.

వయాగ్రాకీ దీనికీ రసాయన నిర్మాణంలో కొద్ది తేడా ఉంది. ఆ తేడా వల్ల వర్డెనాఫిల్ వయాగ్రా కంటే 10 రెట్లు సమర్థవంతంగా పనిచేస్తుంది. మరీ గంట సేపటికే దీనిప్రభావం అయిపోకుండా మరికొంత ఎక్కువసేపు ఉంటుంది. 5, 10, 20 మి.గ్రా డోస్‌లో లభ్యమవుతుంది. (లెవిట్రా ప్రస్తుతం ఇండియాలో దొరకడం లేదు.)

## టాడలాఫిల్ (సయాలిస్)

ఈ లిలీ-ఇకోస్ వారి ఉత్పాదన కూడా PDE-5 ఇన్హిబిటర్ వర్గానికే చెందుతుంది. దీని రసాయనిక నిర్మా ణం కూడా వయాగ్రా కంటే కొద్దిగా మాత్రమే భిన్నంగా ఉంటుంది.

మాత్ర వేసుకున్న 36 గం॥ల వరకు ప్రభావం ఉండటం దీని ప్రత్యేకత. (అందుకే దీన్ని Weekend Pick అంటారు).

అంతేకాక భోజనం తిన్న వెంటనే వేసుకోకూడదనే నియమం లేదు.

ఆల్కహాలు ప్రభావం కాని వయసు ప్రభావం కాని దీనిపై లేవు. ఇవికూడా మంచి అంశాలే.

5, 10, 20mg డోస్‌లో టాడాలిస్, మేన్‌ఫోర్స్, పేర్లతో ఇండియాలో లభ్యం.

| గుణగణాలు | స్తంభన ఔషధం | | |
|---|---|---|---|
| | వయాగ్రా (సిల్డెనాఫిల్) | లెవిట్రా (వర్డెనాఫిల్) | సియాలిస్ (టాడలాఫిల్) |
| ఏ వర్గం? | PDE-5 ఇన్హిబిటర్ | PDE-5 ఇన్హిబిటర్ | PDE-5 ఇన్హిబిటర్ |
| డోస్ | 25-100mg | 5-20mg | 5-20mg |
| అత్యుత్తమ గుణమిచ్చే కాలం | 1 గంట | 40-60 ని. | 2 గం. |
| శరీరంలో ఔషధ ప్రభావం ఉండే సమయం | 8-12 గం. | - | 36 గం. |
| వీటితోపాటు వాడకూడని మందులు | నైట్రేట్లు | నైట్రేట్లు, ఆల్ఫా బ్లాకరు రకం బి.పి. మందులు | నైట్రేట్లు, ఆల్ఫా బ్లాకర్లు |
| భోజనం, ఆల్కహాలు ప్రభావం | 1-2 గం.ల ముందు ఏమీ తీసుకోకూడదు. | - | భోజనం, ఆల్కహాలు ప్రభావం లేదు. |
| సైడ్ ఎఫెక్టులు | తలనొప్పి, వేడిఆవిర్లు ముక్కు దిబ్బడ, కంటిచూపు చెదరడం బి.పి. తగ్గడం | తలనొప్పి, వేడిఆవిర్లు ముక్కు దిబ్బడ, కంటిచూపు చెదరడం బి.పి. తగ్గడం | తలనొప్పి, వేడిఆవిర్లు ముక్కు దిబ్బడ, బి.పి. తగ్గడం |
| ఇతరం | - | సిల్డెనాఫిల్‌కన్నా మంచి ప్రభావం | సిల్డెనాఫిల్‌కన్నా మంచి ప్రభావం |

### ఏది ఉత్తమం? దీనిసైడ్ ఎఫెక్టులు అధికం?

వైద్య పరిశోధనలూ, చికిత్సలో గడించిన అనుభవం దృష్ట్యా PDE-5 ఇన్హిబిటర్ వర్గపు మందులు మొత్తంమీద సురక్షితమేనని, పేషెంట్లు వీటిని వేసుకోవడం వల్ల అపాయకరమైన సమస్యలకి గురవటం లేదనీ తేలింది.

తలపోటు, మొహం ఎర్రబడి ఆవిర్లు రావడం, ముక్కు దిబ్బడ వెయ్యడం వంటివి ఈ మందుల వల్ల సాధారణంగా కలుగుతున్న సైడ్ ఎఫెక్టులు. సిల్డెనాఫిల్, వర్డెనాఫిల్ - ఈ రెండూ కంటి చూపులో కాస్సేపు దోషాలు కలిగిస్తాయి. టాడలాఫిల్ వల్ల ఆ సమస్య కలగటం లేదు.

ఈ మందులు ఒక్కటీ వేసుకున్నందు వల్ల గుండెపోటు లాంటి ప్రమాదకర పరిస్థితులు వస్తున్నాయనడానికి ఆధారాలు దొరకలేదు. (ఎటొచ్చీ నైట్రేటు మందులతో కలిపి వేసుకుంటే (అనగా నాలికకింద పెట్టుకునే గుండెజబ్బు బిళ్ళలు వాడుతూ, వయాగ్రా, లెవిట్రా, టాడాలిస్‌లు వేసుకుంటే) ప్రాణాపాయం కలిగే అవకాశం ఉంది.

అయితే లెవిట్రా, సియాలిస్ వేసుకునే వారు ఆ సమయంలో బి.పి. బిళ్ళలు (ముఖ్యంగా ఆల్ఫాబ్లాకరు రకానికి చెందిన బిళ్ళలు) వేసుకోకూడదు. దాని వల్ల బి.పి. బాగా పడిపోయి అపాయం కలగవచ్చును.

వయాగ్రాతో ఈ ప్రమాదం లేదు.

మొత్తం మీద PDE 5 ఇన్హిబిటర్ మందులు నపుంసకత్వ చికిత్సలో ఒక విప్లవమే సృష్టించాయి. వయాగ్రా వాడకంపై ఇప్పటికి ప్రపంచం 5 సం॥ల అనుభవం సంపాదించి, వయాగ్రాని సురక్షితమైన మందుగా ప్రకటించింది. మిగతా మందులు వయాగ్రా కన్న బాగా పనిచేస్తున్నా, అవి కొన్ని బి.పి.మందులతో కలిపి వాడడానికి వీల్లేక పోవడం వల్లనూ, వాటిపై వైద్య రంగానికి ఇంకా విశ్వాసం ఏర్పడవలసి ఉన్నందువల్లనూ ప్రస్తుతం వాటికి ఇంకా రెండోస్థానమే ఉంది.

### మరికొన్ని మందులు

అంగస్తంభన చికిత్సకి యిప్పుడు మనం చెప్పుకున్న మందులు మూడూ "స్థానికంగా" (Local గా) పనిచేసే మందులు. అంటే పురుషాంగంలోపలే అవి పనిచేసి ప్రభావం (స్తంభన) కలిగిస్తాయి. ఇవి నోటి బిళ్ళలు.

ఆల్ప్రొస్టడిల్ అనే మరోమందు కూడా స్థానికంగానే పనిచేస్తుంది. కాని ఇది నోటిమాత్రకాదు. పేస్టు రూపంలో ఉండే ఈ మందుని అంగంలోకి ఇంజెక్షను వంటి ప్రత్యేక పరికరం ద్వారా ఎక్కించాలి.

ఇక కేంద్రీయంగా (అంటే మెదడు, నరాల వ్యవస్థ ద్వారా) పనిచేసే ఎపోమార్ఫిన్ మందు ఉంది. 2mg డోస్‌లో ఇది చక్కటి అంగ స్తంభనలు కలిగిస్తుంది. ఇది నోటిద్వారా వేసుకునేదే. కాని దీనికి ఇంకా డ్రగ్ అథారిటీ అనుమతి లేదు. వీటి వివరాలు మరోసారి చూద్దాం.

అంగానికిచ్చే పెపావరిన్, ఫెంటాలమైన్, ప్రోస్టాగ్లాండిన్ E1 ఇంజెక్షన్లున్నాయి. వాటి ఉపయోగం ఇప్పుడు బాగా తగ్గిపోయింది. ★